క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని దుమాలలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన వచ్చింది. గ్రామంలో వివిధ వ్యాధులతో బాధపడుతున్న 150 మందికి రక్త పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న 15 మందిని ఖరీదైనా వైద్యం కోసం ఎల్లారెడ్డిపేట కమ్యూనిటీ హెల్త్ కేంద్రానికి తరలించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు పయ్యావుల రామచంద్రం, కార్యదర్శి నాయిని భాస్కర్‌రెడ్డి, సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, నంది కిషన్, శంకర్, మహదేవ్, రవి, దేవయ్య పాల్గొన్నారు.

షుగర్ వ్యాధి టెస్టులు



టెస్టులు నిర్వహిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

వేములవాడ: వేములవాడ పట్టణంలోని పాపన్న చౌక్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం 120 మందికి డయాబెటీస్ నిర్ధారణ పరీక్షలను ఉచితంగా నిర్వహించినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మారం కుమార్ తెలిపారు. కార్యక్రమంలో తీగల వెంకటేశ్వర్‌రావు, గడప రఘుపతిరావు, డాక్టర్ నాగ రమేశ్, సామవీర రమణ, నేరెళ్ల తిరుమల్‌గౌడ్ పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న సర్పంచ్

వేములవాడఅర్బన్: వేములవాడ రూరల్ మండలం బొల్లారం గ్రామంలోని ప్యూరీఫైడ్ వాటర్ ప్లాంట్‌ను సర్పంచ్ లచ్చయ్య ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శ్యామల, సెస్ డైరెక్టర్ ఆకుల దేవరాజం, ఉపసర్పంచ్ భారతి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అన్నివిధాలుగా అండగా ఉంటాం



చెక్కు అందిస్తున్న వాయుతేజ్ డెవలపర్స్

రామడుగు: తండ్రి కరోనా బారిన పడి మృతి చెందాడు. తల్లి తన ఇద్దరు కూతుళ్లను చదివించేందుకు హోటల్‌లో పనిచేస్తోంది. విషయం తెలిసిన కరీంనగర్‌కు చెందిన శ్రీవాయుతేజ్ డెవలపర్స్ వారు ఆర్థికసాయం అందించారు. రామడుగు మండలంలోని వెలిచాల గ్రామ పరిధిలోనికి కిష్టారావుపల్లికి చెందిన బొల్లి బాల కిషన్ మూడేళ్లక్రితం కరోనాతో మృతి చెందాడు. మృతుడి భార్య సుజాత హోటల్‌లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. ఈక్రమంలో పెద్దకూతురు వివాహం కుదిరింది. విషయం తెలుసుకున్న శ్రీవాయుతేజ్ డెవలపర్స్ వారు ఆదివారం వారిని కరీంనగర్‌లోని కార్యాలయానికి పిలుచుకొని రూ.11వేల విలువ గల చెక్కును వివాహ ఖర్చుల కోసం అందజేశారు. కుటుంబాన్ని అన్నివిధాలుగా ఆదుకుంటామని, చిన్న కూతురు సంధ్య చదువు ఖర్చులు కూడా భరిస్తామని కంపెనీ ప్రతినిధులు హామీ ఇచ్చారు.

నిలువ నీడ లేదు..

- ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ
- బస్ స్టాప్‌ల వద్ద షెల్టర్లు కరువు
- షెల్టర్ నిర్మించాలని వేడుకోలు

వేములవాడఅర్బన్: ఆర్టీసీ బస్సుల కోసం వేచి ఉండాలంటే ఎండాలోనే నిలబడాలి. ఎక్కడ చూసిన బస్ షెల్టర్లు కనిపించడం లేదు. డబుల్ రోడ్లు ఫోర్ వే లేన్‌లు అవుతున్న కాని బస్ షెల్టర్లు మాత్రం నిర్మించడం మరిచారు. ప్రయాణికులు బస్సుల కోసం ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ నిరీక్షించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో యెండ్ల కింద నిర్మాణం చేసిన బస్ షెల్టర్లను రోడ్డు వెడల్పులో తీసివేసి మళ్లీ నిర్మించలేదు. దీంతో ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. ఇప్పటికైనా బస్ స్టాప్‌ల వద్ద బస్ షెల్టర్లను ఏ ర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



బస్ షెల్టర్ లేని వేములవాడ నందికమాన్ ప్రాంతం

వేములవాడ అర్బన్ మండలంలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో రహదారుల పక్కన బస్ షెల్టర్లు లేక ప్రయాణికులు ఎండలోనే నిరీక్షిస్తున్నారు. నందికమాన్ ప్రాంతంలో వేములవాడ–సిరిసిల్ల–కరీంనగర్ మూడు రహదారుల చౌరస్తాలో ఒక్క బస్ షెల్టర్ కూడా లేక ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే కరీంనగర్–సిరిసిల్ల రహదారిలోని కొడుముంజ, అనుపురం, శాభాష్‌పల్లి, గుర్రవానిపల్లె రహదారుల్లో బస్ షెల్టర్లు లేవు. ప్రయాణికులు ఎండలోనే ఉంటున్నారు. వేములవాడ రహదారిలోని చింతాల్‌ఠాణాలో కూడా బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. నందికమాన్ వద్ద సుద్దాల వెళ్లే రూట్‌కు బస్ షెల్టర్ లేక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు ఇప్పటికైనా పట్టించుకుని బస్ షెల్టర్లను ఏర్పాటు చేస్తే ఎండలకు, వానలకు ప్రయాణిలకు ఇబ్బందులు ఉండవని అంటున్నారు.

నందికమాన్ వద్ద ఏర్పాటు చేయాలి



నందికమాన్ వద్ద నిత్యం రద్దీ ఉంటుంది. కొడుముంజ, శాభాష్‌పల్లి, మారుపాక గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు అక్కడి నుంచి వెళ్లాలి. అక్కడ బస్ షెల్టర్ లేక, రోడ్లపై నిలబడాల్సి వస్తోంది. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– నాగుల నవీన్, కొడుముంజ

బస్ షెల్టర్ లేక అవస్థలు



అనుపురం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో బస్‌స్టాప్ వద్ద బస్ షెల్టర్ లేక ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. ప్రయాణికులు ఎండలో ఉండాల్సి వస్తోంది. అధికారులు పట్టించుకుని షెల్టర్ ఏర్పాటు చేయాలి.

– సేర్ల మల్లేశం, అనుపురం

ఎన్నోసార్లు విన్నవించాం



నూతనంగా నిర్మాణం చేసిన ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో బస్ స్టాప్‌ల వద్ద బస్ షెల్టర్లను నిర్మించాలని, గతంలో కూడా అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. కాని ఇప్పటి వరకు ఎవరూ స్పందించలేదు.

– పోన్నం వినయ్. కొడుముంజ

నియామకం

జన విజ్ఞాన వేదిక నూతన కార్యవర్గం

సిరిసిల్లకల్చరల్: జన విజ్ఞాన వేదిక జిల్లా శాఖకు జేవీజీ అధ్యక్షుడు ఆకునూరి శంకరయ్య సారథ్యంలో నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గన్నమనేని శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా పాముల దేవయ్య, పోతుగంటి శ్రీనివాస్, మొగిలి లక్ష్మణ్, కార్యదర్శులుగా పుప్పాల శ్రీనివాసచారి, జక్కని నవీన్, గోశిక మధు, సాంస్కృతిక కమిటీ సభ్యులుగా బంటు బాల కిషన్, అక్కపెల్లి యాదగిరి, లాల శ్రీనివాస్, గుర్రం దేవదాస్ ఎంపికయ్యారు. ఎన్నికలకు జాతీయ జన విజ్ఞాన వేదిక సలహాదారు పీవీ రావు, రాష్ట్ర అధ్యక్షుడు ఆకునూరి శంకరయ్య పరిశీలకులుగా వ్యవహరించారు. అనంతరం పీవీ రావు మాట్లాడుతూ రాష్ట్ర మహాసభలు నల్గొండ జిల్లా మిర్యాలగూడలో ఈనెల 19 నుంచి నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలు, శాస్త్రీయ విధానాలు, యుద్ధాలు తదితర అంశాలపై మహాసభల్లో చర్చిస్తారని అన్నారు. జిల్లా నుంచి పెద్ద ఎత్తున మేధావులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరై మహాసభలను జయప్రదం చేయాలని కోరారు.

'యువత కేటీఆర్‌ను ప్రశ్నించండి'

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలో సోమవారం జరిగే యువకుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొంటున్న మంత్రి కేటీఆర్‌ను యువత ప్రశ్నించాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య కోరారు. స్థానిక పార్టీ ఆఫీస్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. యువకులకు మంత్రి ఏం చేశాడని ఈ ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేస్తున్నారని అడిగారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ ఇవ్వలేదన్నారు. ఉద్యోగాల నోటిఫికేషన్లు వేస్తూ రద్దు చేయడం పరిపాటిగా మారిందన్నారు. వీటన్నింటిపై మంత్రి కేటీఆర్‌ను యువకులు నిలదీయాలని కోరారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, పార్టీ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు సూడిద రాజేందర్, బానోతు రాజునాయక్, కొత్తపల్లి దేవయ్య, ఎండీ హిమాం, మర్రి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ చొప్పదండి ఎమ్మెల్యే అభ్యర్థిని మార్చాలి

- సేవాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు భానుప్రియ



మాట్లాడుతున్న భానుప్రియ

గంగాధర: బీఆర్ఎస్‌కు కోవర్టు చొప్పదండి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మేడిపల్లి సత్యంను మార్చాలని, ఇరవై ఏళ్లుగా పార్టీ కోసం పనిచేస్తున్న తనకు అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు భానుప్రియ అధిష్టానాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఓటర్లు ఎక్కువగా ఉన్నారని, ఆ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులకు పోటీ చేసే అవకాశం ఇవ్వాలన్నారు. స్థానికేతరుడైన మేడిపల్లి సత్యం ఓడిపోతే ఇక్కడ కనిపించడన్నారు. సమావేశంలో ఆమె వెంట కాంగ్రెస్ నాయకులు, తదితరులు ఉన్నారు.

మాదిగల విశ్వరూప మహాసభ కరపత్రం ఆవిష్కరణ

హుజూరాబాద్: పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలని డిమాండ్ చేస్తూ 11న హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించే మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు కోరారు. ఆదివారం పట్టణంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ కార్యాలయాన్ని నాయకుడు తునికి వసంత్ అధ్యక్షతన ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో విశ్వరూప మహాసభకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ ముప్పై ఏళ్లుగా పెండింగ్ లో ఉందన్నారు. వర్గీకరణను పార్లమెంటు ద్వారా చట్టం చేసి మాదిగ, మాదిగ ఉప కులాలకు న్యాయం చేయాలని కోరారు.

వేములవాడలో పోలీసుల కవాతు



వేములవాడ: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వేములవాడ పట్టణంలో డీఎస్పీ నాగేంద్రచారి, టౌన్ సీఐ కరుణాకర్, సెంట్రల్ ఫోర్స్ ఆదివారం రాత్రి కవాతు నిర్వహించారు.

చిత్రకథ



గోదాంకు దారేది..?

వేములవాడరూరల్: రైతులకు మందులు అందుబాటులో ఉండేందుకు వేములవాడ పీఏసీఎస్ సొసైటీ దాదాపు రూ.25 లక్షలతో సంవత్సరం క్రితం నిర్మించిన గోదాంకు వాహనాలు వచ్చి వెళ్లేందుకు దారి లేక నిరుపయోగంగా మారింది. గోదాం దారి కోసం చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి సంవత్సరకాలంగా అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా ఫలితం లేదు. కొన్నేళ్ల క్రితం ఉన్న దారిని తొలగించడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఈ గోదాంకు మందు బస్తాలను తీసుకువచ్చే వాహనాలు వచ్చేందుకు వీలులేకుండా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి దారి ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

యువ సమ్మేళనానికి తరలిరండి

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య
- నేడు ఎల్లారెడ్డిపేటలో యువ ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న తోట ఆగయ్య

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలో సోమవారం నిర్వహిస్తున్న యువ సమ్మేళనానికి భారీ సంఖ్యలో యువత తరలిరావాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య కోరారు. యువసమ్మేళనానికి చేస్తున్న ఏర్పాట్లను ఆదివారం పరిశీలించి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గెలుపునకు నాందిగా నిలుస్తాయన్నారు. చేనేత కార్పొరేషన్ చైర్మన్ గూడూరు ప్రవీణ్, చైర్మన్ చిక్కాల రామారావు, ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు వరుస కృష్ణహరి, ఏఎంసీ చైర్మన్ ఎలుసాని మోహన్‌కుమార్, నాయకులు అందె సుభాష్, శ్రీనివాస్, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన



కేంద్రాలను పరిశీలిస్తున్న ఏసీపీ జీవన్‌రెడ్డి

సైదాపూర్: మండలంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఆదివారం హుజూరాబాద్ ఏసీపీ జీవన్‌రెడ్డి పరిశీలించారు. వెన్నంపల్లి, సైదాపూర్, దుద్దెనపల్లి, ఆకునూర్, ఘనపూర్, అమ్మనగుర్తి, బొమ్మకల్, రాయికల్‌ను సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించారు. పోలింగ్ బూత్ కేంద్రాలను పరిశీలించి, సమస్యలు రాకుండా అందరూ సహకరించాలని ఏసీపీ గ్రామస్తులను కోరారు. కార్యక్రమంలో సైదాపూర్ ఎస్ఐ ఆరోగ్యం, తదితరులు ఉన్నారు.

'జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తున్నాం'



మాట్లాడుతున్న దరువు ఎల్లన్న

సిరిసిల్లటౌన్: తెలంగాణ ప్రజల ఆకాంక్షలు దశల వారీగా నెరవేరుతున్నాయ్.. రెండు దశలుగా ప్రభుత్వం నీళ్లు, నిధులు సాధించింది..ఇక నియామకాలకు మూడో దశలో జరుగుతాయని ఓయూ విద్యార్థి నేత దరువు ఎల్లన్న పేర్కొన్నారు. సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మూడోసారి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే చేపట్టబోయే ఉద్యోగాలపై సీఎం కేసీఆర్ జాబ్‌క్యాలెండర్ విడుదల చేయనున్నారని తెలిపారు. రేవంత్‌రెడ్డి ఒక సమైక్యవాది ఆయనను తరమికొట్టాలన్నారు. ఉద్యమనేత కేసీఆర్ వెంటనే తెలంగాణ ఉద్యమకారులున్నారన్నారు. నాయకులు జక్కుల నాగరాజు, మెంగని మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి సేవ



వేములవాడ: మిగిలిన భోజనాన్ని యువ చైతన్య దీపం ఫౌండేషన్ ఆధ్వర్యంలో శేఖర్ అనే యువకుడు తన సొంత ఓమినీ వ్యాన్‌లో పట్టణ పరిసర ప్రాంతాలు, పేదలుంటే ప్రాంతాల్లో ఆదివారం రాత్రి పంపిణీ చేశారు.

పడితే ప్రమాదమే..



గంగాధర: కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారికి ఇరువైపులా ఎండిపోయిన వృక్షాలతో ప్రమాదం పొంచి ఉంది. కొండన్నపల్లి శివారు నుంచి గంగాధర శివారు వరకు ఏపుగా పెరిగిన వృక్షాలతో పాటు ఎండిన చెట్లు ఎప్పుడు పడిపోతాయో తెలియని పరిస్థితి నెలకొంది. కొండన్నపల్లి బస్టాండు, వరదకాలువ సమీపంలో, కురిక్యాల గ్రామశివారులో చెట్లు ఎండిపోయాయి. కురిక్యాల నుంచి గంగాధర వరకు రోడ్డుకు ఇరువైపుల మూడు వరుసల్లో కొన్నేళ్ల క్రితం నాటిన నీలగిరి మొక్కలు ఏపుగా పెరిగాయి. గతేడాది కురిసిన భారీ వర్షాలు, ఈదురుగాలులకు కొన్ని చెట్లు నేలవాలాయి. విద్యుత్ తీగలపై పడటంతో స్తంభాలు విరిగిపోయాయి. గాలులకు చెట్లు విరిగిపడే అవకాశముందని, పక్షులు వాలినా కొమ్మలు విరిగి పడుతున్నాయని వాహనదారులు, గ్రామస్తులు పేర్కొంటున్నారు. కొండన్నపల్లి శివారులో గతంలో ఓ చెట్టు విరిగి ఆర్టీసీ బస్సుపై పడటంతో డ్రైవర్ ప్రమాదానికి గురయ్యాడు. రాత్రి పూట రోడ్డుపై విరిగి పడిన చెట్లను తప్పించబోయిన వాహనదారులు చాలా సార్లు అదుపు తప్పి పడిపోయారని రోడ్డుపక్కనున్న వ్యవసాయదారులు తెలిపారు.

కన్నీళ్లు పెట్టిస్తున్న ఉల్లి కిలోకు రూ.110



వేములవాడ: ఉల్లి ఒక్కసారిగా ధరలు పెరిగిపోయి జనం బేజారవుతున్నారు. ఆదివారం వేములవాడ మార్కెట్లో ఉల్లి కిలోకు రూ.100 నుంచి రూ. 110 వరకు అమ్మకాలు సాగించినట్లు వ్యాపారి వెంకటేశ్ తెలిపారు. అమాంతం ఉల్లి ధర పెరిగిపోవడంతో జనం కొనలేకపోతున్నారన్నారు. జనం సైతం కొనకుండానే ఉల్లి కన్నీళ్లు పెట్టిస్తుందంటూ ఒకరికొకరు చెప్పుకుంటున్నారు.

ఎమ్మెల్సీ బండ ప్రకాశ్ వాహనం తనిఖీ

హుజూరాబాద్‌రూరల్: పట్టణ శివారులోని పర్కాల్ క్రాస్ రోడ్డు చెక్‌పోస్టు వద్ద ఆదివారం ఎమ్మెల్సీ బండ ప్రకాశ్ వాహనాన్ని ఎస్ఎస్‌టీ బృందం తనిఖీ చేశారు. తనిఖీల అనంతరం వాహనం ముందుకు కదిలింది.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

రామడుగు: అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేశామని రామడుగు ఎస్సై తోట తిరుపతి తెలిపారు. చొప్పదండి మండలం కాట్నపల్లి గ్రామానికి చెందిన దుర్మట్ల రాజు ఆదివారం మధ్యాహ్నం రూ.3,300 విలువ చేసే మద్యం బాటిళ్ల తరలిస్తుండగా దత్తోజీపల్లి చౌరస్తా వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా పట్టుకున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.